సాక్షి అనకాపల్లి

గురువారం । 24 । అక్టోబర్ । 2024



జాతీయ గుర్తింపు

రాష్ట్ర స్థాయి హాకీ జట్టు ఎంపిక నక్కపల్లిలో ఉత్సాహంగా జరిగింది. వచ్చే నెల 8 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. 8లో



విదేశీ విద్యార్థుల హాస్టల్ పరిశీలన

విశాఖ సిటీ: ఏయూ విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం రిజిస్ట్రార్ ధనంజయరావు సందర్శించి, సదుపాయాలను పరిశీలించారు.



తీరం అల్లకల్లోలం

కొమ్మాది: దాన తుపాను నేపథ్యంలో విశాఖలోని సాగర తీరాలు అల్లకల్లోలంగా ఉన్నాయి. రుషికొండలో బోటు షికారు నిలిపివేశారు.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ ఏసీగా సుర్జిత్ సింగ్

సాక్షి, అనకాపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎస్.సుర్జిత్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

అర్ధరాత్రి వరకు సీఐడీ తనిఖీలు

కశింకోట: మండలంలోని సుందరయ్యపేటలో ఉన్న విశాఖ డిస్టిలరీ పరిశ్రమలో సీఐడీ నిర్వహించిన తనిఖీలు మంగళవారం రాత్రి 11 గంటల వరకు కొనసాగాయి. ఉదయం 9.30 గంటల నుంచి రికార్డులు, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. పరిశ్రమలో బాట్లింగ్ చేస్తున్న 9 రకాల బ్రాండ్ల సీసాలను, కొలతలను పరిశీలించారు. మద్యం నాణ్యత నిర్ధారణ కోసం నమూనాలు సేకరించారు. సుమారు పది మంది సీఐడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు సమాచారం. సీఐడీ అధికారుల పరిశీలనలో అవకతవకలు బయటపడ్డాయని, హార్డ్‌డిస్క్, రికార్డులు సీజ్ చేసి తీసుకువెళ్లారని తెలిసింది. సుందరయ్యపేటలో ఉన్న మరో లిక్కర్ పరిశ్రమలో కూడా సీఐడీ అధికారులు దాడులు నిర్వహించినట్టు భోగట్టా.

నేవీ స్థావరం భూసేకరణ వివాదంపై ఎస్పీ సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: రాంబిల్లి మండలం వాకపాడులో నేవీ ప్రత్యామ్నాయ స్థావరం భూ సేకరణను బంగారమ్మపాలెం మత్స్యకారులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారమ్మపాలెం మత్స్యకారుల సమస్యలు సమగ్రంగా తెలుసుకోవాలని, గ్రామాల్లో ఎటువంటి ఉద్రిక్తత లేకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. మత్స్యకారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, సీఐలు మల్లికార్జునరావు, నరసింగరావు, రామకృష్ణ, కుమారస్వామి, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములు పరిశీలించిన జేసీ



ఏపీఐఐసీ సేకరించిన భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలోని రాజయ్యపేటలో ఏపీఐఐసీ సేకరించిన భూములను జాయింట్ కలెక్టర్ జాహ్నవి బుధవారం పరిశీలించారు. భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించే కార్యక్రమంలో భాగంగా అవసరమైన అనుకూలమైన భూములను ఆమె మ్యాప్ ద్వారా చూశారు. ఎంతమంది నిర్వాసితులున్నారు, ఎంత భూమి అవసరమవుతుంది, పునరావాసానికి అవసరమైన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. ఉద్దండపురం, పెద బోదిగల్లం ప్రాంతాల్లో భూసేకరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించి, అందుకు అవసరమైన భూములను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఇతర గ్రామాల్లో ఉన్న భూములను సైతం ఆమె మ్యాప్ ద్వారా చూశారు. వీరివెంట తహసీల్దార్ నర్సింహమూర్తి, డీటీ అన్నాజీరావు తదితరులు ఉన్నారు.

మహిళను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

నర్సీపట్నం: సైబర్ నేరగాళ్లు మహిళను మోసగించి రూ.3.79 లక్షల నగదును కాజేసిన ఘటన నర్సీపట్నం మండలం నీలంపేటలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రాజారావు అందించిన వివరాలు.. మాకిరెడ్డి కల్పన ఉద్యోగాల కోసం షేర్ చాట్‌లో అన్వేషిస్తుండగా వేరే యాప్‌కు కనెక్ట్ అయింది. సైబర్ నేరగాళ్లు ముందుగా ఆమె అకౌంట్‌కు రూ.1300 బోనస్ కింద జమ చేశారు. తరువాత మరో రూ.200 జమ చేశారు. దఫదఫాలుగా డబ్బులు రావాలంటే రూ.80 వేలు పంపించాలని చాటింగ్‌లో సైబర్ నేరగాళ్లు సూచించారు. యాప్‌లో ఆమె రూ.80 వేలు జమ చేసింది. 'నీ అకౌంట్ బ్లాక్ అయింది. మరికొంత అమౌంట్ పంపించాల'ని సైబర్ నేరగాళ్లు చాట్ చేశారు. బంగారం తాకట్టుపెట్టి, అప్పు చేసి రూ.3.79 లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా వివిధ అకౌంట్లకు జమ చేసింది. అటు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయానని తెలుసుకొని రూరల్ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వనాలు వెల్లివిరిసేలా..

ఉమ్మడి విశాఖ జిల్లాలో 44 శాతం అటవీ విస్తీర్ణం ఉండేది. జిల్లాల పునర్విభజనతో అనకాపల్లి జిల్లా అటవీ విస్తీర్ణం 18 శాతం మాత్రమే ఉంది. అటవీ విస్తీర్ణం పెంచే దిశగా సామాజిక అటవీ విభాగం అడుగులు వేస్తోంది.



నర్సరీలో సిద్ధం చేస్తున్న మొక్కలు



నర్సీపట్నం సోషల్ ఫారెస్టు నర్సరీలో పంపిణీకి సిద్ధం చేసిన మొక్కలు

- ఈ ఏడాది లక్ష్యం 31.2 లక్షల మొక్కల పంపిణీ
- జిల్లాలో 38 నర్సరీలలో మొక్కలు సిద్ధం

నర్సీపట్నం : పర్యావరణ పరిరక్షణ దిశగా సామాజిక అటవీ విభాగం విరివిగా మొక్కలు నాటడంతో పాటు ప్రతి ఇంటా మొక్క ఉండేలా బాధ్యత తీసుకుంది. జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపుదల, పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో సోషల్ ఫారెస్టు అధికారులు అటవీ వనాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. రైతులకు అవసరమైన సరుగుడు, మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్ ఫామ్ మొక్కలను రైతులకు సబ్సిడీ మీద అందిస్తున్నారు. సామాజిక వన విభాగం, హార్టికల్చర్, డుమ్మా, జేకే పేపర్ మిల్ సంయుక్తంగా మొక్కలను పెంచి రైతులకు అందిస్తున్నారు. ఈ ఏడాది 31.2 లక్షల పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హరిత జిల్లాగా తీర్చేందుకు సామాజిక అటవీశాఖ కృషి చేస్తోంది.

జిల్లాలో 2023–24లో సామాజిక అటవీ విభాగం, హార్టికల్చర్, డ్వామా, జె.కె.పేపరు మిల్ ద్వారా 60 లక్షల మొక్కలు పంపిణీ చేశారు. వీటిలో సామాజిక అటవీశాఖ 16.20 లక్షల సరుగుడు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. జేకేపేపర్ మిల్ వారు 40 లక్షల మొక్కలు పెంచి, ఒక్కంటికి రూ.2.50 చొప్పున రైతులకు అందించారు.

హార్టికల్చర్ విభాగం 1.80 లక్షలు ఆయిల్ పామ్, మామిడి, జీడిమామిడి, కొబ్బరి మొక్కలను రైతులకు సబ్సిడీపై సరఫరా చేసింది. డ్వామా ఆధ్వర్యంలో చెరువు గట్లపై మొక్కలు నాటారు.

డీగ్రేడెడ్ ఫారెస్టులో టేకు, మారుజాతి మొక్కలు

అటవీశాఖ టెర్రిటోరియల్ విభాగం డీగ్రేడెడ్ ఫారెస్ట్‌లో టేకు, మారుజాతి మొక్కలు 1.80 లక్షలు నాటి, ఫారెస్ట్ శాతం పెరిగే దిశగా అడుగులు వేస్తుంది. సామాజిక అటవీ విభాగం, ఎన్‌టీపీసీ, పోర్ట్ ట్రస్ట్ వారి సహకారంతో ప్రతి ఏటా 40 వేల మొక్కలు వేయడం, వాటిని సంరక్షించి రెండేళ్ల తరువాత పంచాయతీలకు అప్పగిస్తూ అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు 50 లక్షల మొక్కలు లక్ష్యం నిర్దేశించగా జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో 60 లక్షల మొక్కలు రైతులకు పంపిణీ చేశారు.

హరిత పథంలో జిల్లా



జిల్లాను హరిత పథంలో నడిపించేందుకు సామాజిక అటవీ విభాగం కృషి చేస్తోంది. అన్ని శాఖల సమన్వయంతో గతేడాది 60 లక్షల మొక్కలు పంపిణీ చేశాం. ఈ ఏడాది 31.2 లక్షల మొక్కలు పంపిణీ చేసేందుకు 38 నర్సరీలలో మొక్కలను సిద్ధం చేశాం. రైతుల అవసరాన్ని బట్టి పండ్ల మొక్కలతో పాటు సరుగుడు మొక్కలను పంపిణీ చేస్తున్నాం. స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో రెవెన్యూ ప్లాంటేషన్‌లను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం.

– జి.లక్ష్మణ్, జిల్లా సోషల్ ఫారెస్ట్ అధికారి

'ఉక్కు' సంకల్పంతో పోరాటం కొనసాగిస్తాం..

- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా...
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి



విజయసాయిరెడ్డికి స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తరువాత బుధవారం తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయన ఎయిర్‌పోర్టులో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్తలు, సీనియర్ నేతలంతా కలిసికట్టుగా ఉద్యమిస్తామన్నారు. దసపల్లా భూములు, ఎన్‌సీసీ భూములు, మరే ఇతర భూముల విషయంలోనైనా తాను విచారణకు సిద్ధమని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియాతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శిస్తారని తెలిపారు.

ఘన స్వాగతం

ఎయిర్‌పోర్టులో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, ముస్లిం మైనార్టీ నాయకుడు ఫరూఖీ, ముఖ్యనేతలు గొలగాని శ్రీనివాస్, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

స్క్రాప్ వాహనాల వేలం

తుమ్మపాల : స్క్రాప్ వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,84,600 నగదు సమకూరిందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి మనోహర్ అన్నారు. జిల్లా రవాణా కార్యాలయంలో బుధవారం వాహనాల వేలం పాట నిర్వహించారు. ఆరు వాహనాలకు నిర్వహించిన వేలం పాటలో ఐదు వాహనాలను స్క్రాప్ కింద వేలం వేసినట్టు ఆయన తెలిపారు. ఒక వాహనం యాజమాని పెనాల్టీతో సహా నగదు చెల్లించడంతో వాహన యజమానికి అవకాశం కల్పించి వాహనాన్ని విడుదల చేశామన్నారు. మొత్తం 32 మంది వేలం పాటలో పాల్గొన్నారన్నారు. గడిచిన రెండు వారాలుగా అచ్యుతాపురం రోడ్డులో హెవీ లోడ్ వాహనాలపై ప్రత్యేక రైడ్ నిర్వహించి 44 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. లైసెన్స్ లేని వాహనదారులపై 60, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై 151, నో హెల్మెట్ 335, సీట్ బెల్ట్ లేని వాహనాలపై 10, ఫిట్‌నెస్ లోపాలపై 132 వాహనాలపై కేసులు నమోదు చేసి ఫైన్ వేశామని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే భారీ పెనాల్టీలు..

జిల్లాలో ప్రమాదాల నివారణకు చర్యలు పటిష్టం చేస్తున్నామని డీటీవో తెలిపారు. జిల్లా పరిధిలో లంకెలపాలెం నుంచి పాయకరావుపేట వరకు 27 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, త్వరలో పర్యవేక్షణ కమిటీ ఆయా స్పాట్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నూతన చట్టం ప్రకారం జరిగిన మార్పులపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా రోడ్లపై ప్రయాణిస్తే రూ.1000, నో లైసెన్స్ రూ.5 వేలు, నో ఆర్‌సీ రూ.2 వేలు, ఫిట్‌నెస్ లోపాలు రూ.5 వేలు, నో సీట్ బెల్ట్ రూ.1000, డ్రైవింగ్‌లో మొబైల్‌లో మాట్లాడడం, ట్రిపుల్ రైడింగ్‌కు రూ.1500, అతి వేగం చిన్న వాహనాలకు రూ.1000, భారీ వాహనాలకు రూ.2 వేలు, పర్మిట్ లేని భారీ వాహనాలకు రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సిందే అని స్పష్టం చేశారు.



వాహనాల వేలం పాట నిర్వహిస్తున్న ఆర్టీవో

లక్ష్యాల సాధనలో ముందుండాలి

- ఎస్‌హెచ్‌జీలన్నీ 'ఎ' గ్రేడ్‌లో ఉండాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్
- డీఆర్‌డీఏ సిబ్బందితో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తుమ్మపాల : లక్ష్యాల సాధనలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి, లక్ పతి దీదీ, ముద్ర రుణాలు, నారీశక్తి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లక్ష్యాలు పూర్తి చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

స్వయం సహాయక సంఘాలన్నీ 'ఎ' గ్రేడులో ఉండేటట్టు పనిచేయాలన్నారు. ఉన్నతి, స్త్రీనిధి, లక్ పతి దీదీ పథకాల ద్వారా లక్ష్యం మేరకు సభ్యులకు లబ్ధి చేకూర్చాలని, ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్ అమ్మకాల కోసం రూపొందించిన ఓఎన్‌డీసీ డిజిటల్ ప్లాట్ ఫామ్‌లో ఎక్కువ వస్తువులు రిజిస్టర్ చేయాలని తెలిపారు.

మహిళా సంఘాల సమావేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, రక్తహీనత, రోడ్డుభద్రత, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, ఏపీడీ డైజీ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీలు



బీసీటీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ



మాడుగులలో కళాశాల విద్యార్థినుల హాస్టల్ తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ



పూడిమడకలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి రమేష్

- హాస్టళ్లలో వసతులను పరిశీలించిన న్యాయమూర్తులు

రాంబిల్లి (యలమంచిలి): విద్యార్థులకు వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పేపకాయల విజయ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి ఆమె రాంబిల్లి మండలంలో కేజీబీవీ, బీసీటీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ధార భోగాపురంలో ఉన్న బీసీటీ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సేవలు, వారికి పెడుతున్న ఆహార పదార్థాలు, వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. గదులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారికి పెడుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేసి, మెనూ అమలు చేస్తున్నారో లేదో కనుక్కున్నారు. న్యాయవాదులు కూడా ఈ తనిఖీలో పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్: స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మంగళవారం రాత్రి మండలంలో పలు కళాశాల, పాఠశాల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సయ్యపేట, తాటిపర్తి, గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలను సందర్శించారు. వీటితో పాటు మండల కేంద్రంలో గల బీసీ బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. వంటశాలలు, మరుగుదొడ్లు, పడక గదులు, రీడింగ్ రూమ్‌లను పరిశీలించారు. మాడుగులలోని బాలికల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోందని, పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

పూడిమడకలో..

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలంలోని పలు హాస్టళ్లలో అనకాపల్లి ఫస్ట్ ఏడీఎం కోర్టు న్యాయమూర్తి ఎ.రమేష్ మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పూడిమడకలోని బీసీ హాస్టల్, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్‌ను ఆయన సందర్శించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించి.. తర్వాత శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమావేశానికి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

బాలికపై లైంగిక దాడి.. యువకుడికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్ : దివ్యాంగురాలైన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే ఆరు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దివ్యాంగురాలైన బాలిక (16) అనకాపల్లి జిల్లా రోలుగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీ అగ్రహారంలో ఉంటున్నారు. నిందితుడు కాకర దాసు (25) అదే ప్రాంతంలో మోటార్ మెకానిక్‌గా ఉండేవాడు. 2014 జూలై 7వ తేదీన బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలికకు మాటలు రాకపోవడంతో సైగల ద్వారా విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. అర్థం చేసుకున్న తల్లి జరిగిన అన్యాయాన్ని గ్రామ పంచాయతీలో విన్నవించుకున్నారు. కేసు పోలీస్ స్టేషన్ చేరకుండా ఉండదానికి గ్రామ పెద్దలు బాలిక తల్లిదండ్రులకు రూ.5,000కు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. బాలిక తల్లిదండ్రులు అందుకు అంగీకరించకుండా రోలుగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 376, 354, పోక్సో చట్టం 3.4.సెక్షన్లు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.



ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లై అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అరకు పద్మాపురం గార్డెన్‌లో విజయదశమి నాడు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతి కోసం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు. పర్యాటకులు గాలిలో విహరించి అరకులోయ పరిసర అందాలను వీక్షించే వీలు కలుగుతుంది. మంగళవారం వరకు ట్రయల్ రన్ నిర్వహించామని, ఒకొక్క వీక్షకుడు పది నిమిషాలు విహరించేందుకు నుంచి రూ.1500 వసూలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

గాలిలో తేలిపోదాం..

- హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లైకు ట్రయల్ రన్ పూర్తి

హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లై అందుబాటులోకి వస్తే 200 మీటర్ల ఎత్తులో విహరిస్తూ ప్రత్యేక అనుభూతి పొందవచ్చు. ఇక్కడికి సమీపంలోని జైపూర్ జంక్షన్ ప్రాంతంలో కూడా త్వరలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పారా మోటరింగ్ కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా పీవో అభిషేక్ ట్రయల్ రన్ నిర్వహించారు.

– అరకులోయ టౌన్



మేఘాల్లో విహరిద్దాం..

- లంతంపాడు, దిబ్బవలస ప్రాంతాల్లో అందాలు కనువిందు

ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన అరకులోయ ప్రాంతంలో మరో మేఘాల కొండ వెలుగులోకి వచ్చింది. మండలంలో సిర్గం పంచాయతీ పరిధిలో లంతంపాడు, దిబ్బవలస గ్రామాల సమీపంలో ఎత్తయిన అటవీ ప్రాంతంలో మంచు అందాలు పాల సముద్రాన్ని తలపిస్తున్నాయి. వంజంగి హిల్స్‌లో మాదిరిగానే ఇక్కడ కూడా కనువిందు చేస్తున్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉండటంతోఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

– అరకులోయ రూరల్

క్లుప్తంగా

కఠినంగా పోక్సో చట్టం అమలు అవసరం



ఎస్పీ తుహిన్ సిన్హాతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు సీతారాం

అనకాపల్లి: జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని, బాలలపై జరిగే అకృత్యాలు అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పోక్సో కేసులో నిందితులకు తక్షణం శిక్ష పడేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, హైస్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి కె.అనంతలక్ష్మి, అనకాపల్లి సీడీపీవో ప్రభావతి, బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, పీవోఎస్ఐసీకేఎల్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్‌టీ హాస్టల్ కుక్ తొలగింపు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం డీఎన్‌టీ విద్యార్థుల(బాలురు) వసతి గృహం కుక్ ఎం.కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా బీసీ వెల్ఫేర్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేశ్వరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎన్‌టీ వసతి గృహం సంక్షేమ అధికారి నారాయణరావు మాట్లాడుతూ ఈ నెల 20న బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి శనివాడ హేమంత్ అల్లరి చేస్తుండడంతో కుమార్ కొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడని చెప్పారు. ఈ విషయం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లగా.. మంగళవారం రాజేశ్వరి విచారణ చేపట్టారన్నారు. ఈ మేరకు కుక్‌ను విధుల నుంచి తొలగించారని నారాయణరావు తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. డీఎస్సీకి సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ అందిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ప్రకటించిన దరఖాస్తు గడువు 21వ తేదీతో ముగియడంతో ఈ నెల 25 వరకు మరోసారి పొడిగించారు. దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం అభ్యర్థుల ఎంపికకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రామారావు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేరోజు ఈ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు వారి ఆసక్తికి అనుగుణంగా వివిధ జిల్లాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. విశాఖ జిల్లాలో 100 మంది వరకు శిక్షణ కోసం ఎంపిక చేస్తామన్నారు.

అక్కతో ప్రేమ వివాహం..చెల్లెలిపై అత్యాచారం

- పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్
- విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ



మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి రూరల్ : పట్టణంలో 16 ఏళ్ల బాలికపై లైంగిక దాడి కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. నిందితుడు వెంకీ(20) బాధితురాలి అక్కను ప్రేమించి పెళ్లి చేసుకుని ఏడాదిన్నర కాకముందే భార్య చెల్లెలిపై కన్నేసి ఆమెపై ఘాతుకానికి ఒడిగట్టాడు. కామంతో కళ్లు మూసుకుపోయిన నిందితుడు చేసిన అఘాయిత్యంతో ఒకే కుటుంబానికి చెందిన బాధితురాలితో పాటు ఆమె అక్క భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారి పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. యలమంచిలి పట్టణంకు చెందిన వెంకీ బాధితురాలి అక్కను ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. గర్భం దాల్చిన వెంకీ భార్య మే నెలలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత బాలింత అయిన అక్కకు సహాయం చేయడానికి ఆమె చెల్లెల్ని (బాధితురాలు) పుట్టింటి నుంచి తన వద్దకు తెచ్చుకుంది. చెల్లెలిపై కన్నేసిన నిందితుడు వెంకీ ఆ ఇంట్లోనే గత మే నెలలో ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమెను బెదిరించి సెప్టెంబరు వరకు పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరితోనైనా చెబితే చంపుతానని, మీ అక్క భవిష్యత్తు పాడవుతుందని నిందితుడు బాధితురాలిని బెదిరించాడు. దీంతో అక్కకు హాని జరుగుతుందన్న బెంగతో ఇన్నాళ్లూ ఈ విషయాన్ని తనలో ఉంచుకుని బాధపడుతున్న బాధితురాలు కొన్ని రోజులుగా ముభావంగా ఉండడం, స్కూల్‌కు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి ఆరా తీయగా తనకు జరిగిన దారుణాన్ని వెల్లడించింది. దీంతో నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు తన తల్లిదండ్రుల సహాయంతో మంగళవారం రాత్రి యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్లు 64(2)(ఎఫ్) (ఎమ్), 65,(1), 351(3) పోక్సో చట్టం-2015 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పరవాడ డీఎస్పీ సత్యనారాయణ నిందితుడు నేరాన్ని అంగీకరించాడన్నారు. నిందితుడ్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు అతని ఇంటి వద్ద మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. చిన్న పిల్లలు, టీనేజిలో ఉన్న మైనర్ల కదలికలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించడంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వాళ్లకు అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి దారుణాల వల్ల రెండు కుటుంబాల మధ్య మానవ సంబంధాలు దెబ్బతింటాయన్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పర్చనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు



బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

చోడవరం రూరల్: బ్రెస్ట్(రొమ్ము) క్యాన్సర్ బారిన పడ్డ మహిళల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని వైద్యురాలు తేజస్విని అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ఎస్‌ఎస్‌ఎస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో యు ఉయ్ కెన్(యువరాజ్‌సింగ్) ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ వ్యాప్తిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ఎంతైనా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్ రోగులను దృష్టిలో ఉంచుకుని స్వస్థ మహిళ-స్వస్థ భారత్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థినులు అవగాహన పెంచుకుని, ఇలాంటి సదస్సులకు తమ తల్లులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. వైద్యులు టి.చరిత, పి.మాధురి, మధువర్షిని, సిబ్బంది విద్యార్థుల తల్లులు, మహిళా అధ్యాపకులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏఎస్ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



కొత్త కార్యవర్గంతో ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామమూర్తి

అనకాపల్లి: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ అసోసియేషన్(వీఆర్‌ఏఎస్) జిల్లా అధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన బుధవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.లోవరాజు, సహాయ అధ్యక్షుడిగా చింత అప్పారావు, ఉపాధ్యక్షులుగా పి.దండు, వాకాడ గణేష్, కోశాధికారిగా సీహెచ్.అప్పాలరాజు, సహాయ కార్యదర్శిగా బొడ్డు సింహాచలం నాయుడు, కార్యవర్గ సభ్యులుగా లోవకుమార్, అప్పాల నరసమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీరామమూర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్త కార్యవర్గం మూడు సంవత్సరాలు పాటు పదవిలో ఉంటుందన్నారు.

విజయవాడ వరద బాధితులకు రూ.2.50 లక్షల విరాళం



విరాళ చెక్కును కలెక్టర్‌కు అందిస్తున్న స్పైరాక్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

తుమ్మపాల: ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన విజయవాడ బాధితులను ఆదుకునేందుకు రాంబిల్లి మండలం గురజాపాలెంలోని స్పైరాక్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు రూ.2.50 లక్షల విరాళ చెక్కును కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సిహెచ్.వి.రాంప్రసాద్ బుధవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి అందజేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వి.రావు, ఉద్యోగుల తరఫున ఈ విరాళాన్ని సమకూర్చినట్టు రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.ముకుందరావు, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు జె.జగదీష్, హెచ్.ఆర్.వి.వాసు పాల్గొన్నారు.

పీరియాడికల్ థ్రిల్లర్ 'క'



మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

డాబాగార్డెన్స్(విశాఖ): పీరియాడికల్ థ్రిల్లర్‌గా రూపొందిన 'క' చిత్రం ఈ నెల 31 విడుదలవుతోందని, ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలని హీరో కిరణ్ అబ్బవరం కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను తొలిసారిగా పాన్ ఇండియాలో నటించానని, సుజిత్, సందీప్ రచన, దర్శకత్వంలో సినిమా బాగా వచ్చిందన్నారు. సామ్ సీఎస్ వీనుల విందుగా సంగీతం అందించారని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోతుందన్నారు. హీరోయిన్లుగా నటించిన నయన సారిక, తన్వీరామ్‌కు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గురువారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. తనకు ఎంతో సెంటిమెంట్ అని కిరణ్ చెప్పారు.

చీటీల పేరుతో రూ.20 కోట్లకు టోకరా

భార్యాభర్తలపై చీటింగ్ కేసు నమోదు



బాధితులకు నిర్వాహకులు ఇచ్చిన స్కీమ్ కార్డు

తగరపువలస: తగరపువలసకు చెందిన భార్యాభర్తలు వంగపండు రోజా, శ్రీనివాసరావులపై భీమిలి సీఐ బి.సుధాకర్ బుధవారం చీటింగ్ నమోదు చేశారు. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ చంద్రరావు వీధికి చెందిన కొసన సత్యవతి ఈ మేరకు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందట రోజా, శ్రీనివాసరావు చిప్పాడ వెళ్లి తాము చీటీలు, లక్కీ డ్రాలు స్కీమ్‌లు, వరలక్ష్మి స్కీమ్‌లు వేస్తున్నామని.. వీటి ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తామని గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు చేశారు. డబ్బులు కట్టిన వారికి ఇప్పటి వరకు డబ్బులు, వడ్డీలు తిరిగి చెల్లించలేదు. పంచాయతీ వాసులను నమ్మించి సుమారు రూ.1.35 కోట్ల వరకు వసూలు చేసినట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయం తెలుసుకున్న భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతానికి చెందిన వందల మంది బాధితులు బుధవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రోజా, శ్రీనివాసరావు చేతిలో మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పప్పుల చీటీలు, లక్కీ స్కీమ్‌ల పేరుతో ఈ దంపతులు వసూలు చేసి తిరిగి చెల్లించని సొమ్ము రూ.20 కోట్లు పైబడి ఉంటుందని అంచనా. దీనిపై పోలీసులు గురువారం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

3 నుంచి ఆర్టీసీ 'పంచారామ దర్శిని'

డాబాగార్డెన్స్(విశాఖ): పవిత్ర కార్తీకమాసంలో ఒకే రోజున పంచారామాలను దర్శనం చేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నవంబర్ 3, 10, 17, 24వ తేదీల్లో వచ్చే ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనుంది. అమరేశ్వరస్వామి(అమరావతి), సోమేశ్వరస్వామి(భీమవరం), క్షీర రామలింగేశ్వరస్వామి(పాలకొల్లు), భీమేశ్వరస్వామి(ద్రాక్షారామం), కుమార రామలింగేశ్వరస్వామి(సామర్లకోట)ని ఒకే రోజు దర్శనాలు చేసుకునేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100, ఇంద్ర ప్రయాణ చార్జీ రూ.2,600గా నిర్ణయించారు.

లంబసింగి టూర్..

కార్తీక మాసం పురస్కరించుకుని పిక్నిక్‌లకు లంబసింగి వెళ్లే పర్యాటకులకు శని, ఆది వారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి, కాఫీ ప్లాంటేషన్ చూపిస్తారు. ఒక్కొక్కరికి అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.800, ఎక్స్‌ప్రెస్ ప్రయాణ చార్జీ రూ.650.

ధారమట్టం టూర్

ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. శివాలయం, ధారమట్టం వాటర్‌ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జనకొండ(అనకాపల్లి) చూపిస్తారు. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.650, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.550.

విజ్ఞాన విహార యాత్రలకు..

కార్తీక మాసంలో విజ్ఞాన విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వనున్నట్టు అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికులు గ్రూపుగా సంప్రదిస్తే వారు కోరిన రోజున టూర్ స్పెషల్స్ నడుపుతామన్నారు.

సంప్రదించండి ఇలా..

పంచారామ దర్శిని, పిక్నిక్‌లు, మార్గశిర మాసంలో పంచవైష్ణవి క్షేత్ర దర్శనాల కోసం వెళ్లే భక్తులు టీటీటీ. ఏపీఎస్ఆర్టీసీ జీ. జీ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని అప్పలనాయుడు తెలిపారు. ద్వారకాబస్టేషన్ వద్ద గల రిజర్వేషన్ కౌంటర్లలో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731లో సంప్రదించవచ్చు.

30 సెకన్లు.. 184 పంచ్‌లు

- బాక్సింగ్‌లో కనకారావు అరుదైన రికార్డ్
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



మధురవాడ(విశాఖ): పీఎంపాలెం డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు పెదిరెడ్ల కనకారావు అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగంలో 30 సెకన్లలో బాక్సింగ్ గ్లౌజులు 184 పంచ్‌లు విసిరి ప్రపంచ రికార్డును సృష్టించారు. దీంతో అతనికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆగస్టులో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో కనకారావు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులకు పంపించారు. ఈ ఫీట్‌ను రికార్డ్‌గా గుర్తించి నిర్వాహకులు కనకారావును అభినందించి తమ బుక్‌లో పేరు నమోదు చేశారు. ఈ రికార్డ్స్‌కు సంబంధించి సర్టిఫికెట్, మెడల్, ట్రోఫీని బుధవారం ఆయన అందుకున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన బాక్సర్లు ఆయన్ని అభినందించారు.

ఆస్ట్రేలియా టూర్‌కు రికీ, నితీష్

- భారత్ 'ఏ' జట్టుకు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: విశాఖ కుర్రాళ్లు రికీబుయ్, నితీష్‌కుమార్ రెడ్డి భారత్ 'ఏ' జట్టుకు ఎంపికయ్యారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ జట్టు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. నవంబర్ 22 నుంచి జనవరి 8వ తేదీ మ్యాచ్‌లు జరగనున్నాయి. టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో భారత్ 'ఏ' జట్టు రెండు అనధికార నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌లను ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌లకు ఆంధ్రా కెప్టెన్ రికీబుయ్, ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి అవకాశం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు వీరిద్దరిని అభినందించారు. భారత్ ఏ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వం వహించనున్నాడు.

నక్కపల్లి హాకీ క్లబ్‌కు జాతీయ గుర్తింపు



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులతో నాయకులు

- ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం
- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి హాకీ జట్టు ఎంపిక
- వచ్చే నెల 8 నుంచి నక్కపల్లిలో రాష్ట్ర స్థాయి పోటీలు

నక్కపల్లి: నక్కపల్లిలో ఏర్పాటు చేసిన బీఎస్ హాకీ క్లబ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక బుధవారం జరిగింది. నక్కపల్లి హెటిరో హాకీ క్రీడా మైదానంలో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి సుమారు 360 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జట్లు వారీగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టులో చోటు కల్పిస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో నక్కపల్లిలో రాష్ట్ర స్థాయిలో అండర్-14 విభాగంలో హాకీ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులను ఎంపీపీ రత్నం, వీసం రామకృష్ణ, తదితరులు పరిచయం చేసుకున్నారు. నక్కపల్లిలో ఏర్పాటైన బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ అనతి కాలంలోనే మంచి తర్ఫీదునిచ్చి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేసిందని వారు కొనియాడారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ఢిల్లీ, హైదరాబాద్, కడప, తదితర నగరాల్లో జరిగే పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. పలువురు క్రీడాకారులు చెన్నై, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో స్పోర్ట్స్ కోటాలో ప్రవేశాలు కూడా పొందారన్నారు. హెటిరో కంపెనీ సాయంతో విశాలమైన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, హెచ్‌ఎం రాణిలలిత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, బి.బి.లక్ష్మి, రమణ, శ్రీనివాసరావు, నాయకులు అడ్డూరి లోవరాజు, కోసూరు శ్రీను, నానాజీ వీరబాబు, కోచ్ రాంబాబు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ టోర్నీలో ద్వితీయ స్థానం



షూటింగ్ బాల్ టోర్నీలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండల కేంద్రంలోని కైట్స్ విద్యా విహార్ స్కూల్ విద్యార్థులు షూటింగ్ బాల్ టోర్నీలో ఉత్తమ ప్రదర్శన కనిపించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 43వ సీనియర్స్ రాష్ట్ర ఇంటర్ అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ టోర్నీ అనంతపురం జిల్లా నరపాలలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగింది. ఈ పోటీల్లో కైట్స్ విద్యా విహార్‌కు చెందిన చైతన్య, దక్షిత్ ప్రతిభ కనబరిచారు. ఖోఖోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ స్కూల్ నుంచి జాగృతి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రతిభ చూపిన క్రీడాకారులను కరస్పాండెంట్ రెడ్డి గణేష్, ప్రిన్సిపాల్ ప్రసన్న అభినందించారు.

బాలిక ఆత్మహత్య

నర్సీపట్నం: అనారోగ్య సమస్యలతో ఓ బాలిక ఇంట్లో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సీపట్నంలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ కుటుంబంతో నర్సీపట్నం శారదానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈమె కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. బుధవారం స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండిపోయింది. తండ్రి స్కూల్‌కు వెళ్లిపోయారు. మిగతా కుటుంబ సభ్యులు పని మీద బయటకు వెళ్లారు. ఈ సమయంలో తలుపులు వేసుకుని ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య చేసుకుంది. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూసేసరికి ఫ్యాన్‌కు బాలిక మృతదేహం వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి బాలిక మృతదేహాన్ని కిందకు దించారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగా భవానీ ప్యానల్ విజయం

ప్రశాంతంగా నర్సుల ఎన్నికలు



ఎన్నికల్లో గెలిచిన గంగా భవాని ప్యానల్ అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో టి.గంగాభవాని ప్యానల్ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో రెండు ప్యానల్స్ పోటీ పడగా, గంగా భవాని ప్యానల్ విజయం సాధించింది. కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంక్ పక్కనున్న భవనంలోని నర్సెస్ క్లోక్ రూమ్‌లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీక్రెట్ బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహించారు. 555 మంది ఓటర్లకు గాను 521 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 94 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన టి.గంగా భవానికి 336 ఓట్లు, ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన ఎం.ఇందిరకు 319 ఓట్లు, కార్యదర్శి పదవికి పోటీ చేసిన జీవీఎస్ వరలక్ష్మికి 319 ఓట్లు, కోశాధికారి పదవికి పోటీ చేసిన బుద్దరాజు వంశీ 329 ఓట్లు పోలయ్యాయి. కార్యవర్గ సభ్యులుగా ఎస్. మోహర్ శాంతి 390 ఓట్లు, వియ్యపు వీసీల 343 ఓట్లు, దాసరి లిల్లీ గ్రేస్ 303 ఓట్లు, గంగా గౌరీ ఎస్ 290 ఓట్లు, టి.పద్మజ 259 ఓట్లతో విజయం సాధించారు. రెండో ప్యానల్‌లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన వి.ఉషారాణికి 195 ఓట్లు, ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన జి.శాంతమ్మకు 165 ఓట్లు, జైతు రవీంద్రనాథ్‌కు 134, జి.పరమేశ్వరికి 69 ఓట్లు, కోశాధికారి పదవికి పోటీ చేసిన ఎన్.ప్రశాంతికి 198 ఓట్లు వచ్చాయి.

మానసిక ఆందోళనతో వివాహిత ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతమ్మధార(విశాఖ): మానసిక ఆందోళనతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతమ్మధార ప్రాంతంలో నివాసముంటున్న ఎం.మేధానాగ్(33), ఎం.శ్రీకాంత్‌రెడ్డితో 2020, మార్చి 19వ తేదీన వివాహం జరిగింది. మూడేళ్ల పాటు వారు సంతోషంగా ఉన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఉద్యోగరీత్యా 2023లో అమెరికాకు వెళ్లాడు. భార్య మేధానాగ్‌కు వీసా వచ్చాక తీసుకువెళ్లాలని భావించాడు. అయితే వీసాకు సమయం పట్టడంతో మేధానాగ్ మానసిక వేదనకు గురైంది. దీంతో బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఎం.నగేష్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతురాలి తండ్రితో మాట్లాడారు. ఆమెకు, ఆమె భర్తకు ఎటువంటి విబేధాలు లేవని, ఇద్దరూ సంతోషంగానే ఉన్నారని అతడు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం (విశాఖ): దాన తుఫాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

24న రద్దయిన రైళ్లు

ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా (22888)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-హౌరా(18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్

25న రద్దయిన రైళ్లు

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12839) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుణుపూర్-కటక్(08422) మెము, భువనేశ్వర్-విశాఖపట్నం(20841) వందే భారత్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్- కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-రామేశ్వరం(20896) ఎక్స్‌ప్రెస్, పూరీ-యశ్వంత్‌పూర్ (22883)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్

26న రద్దయిన రైళ్లు

పూరీ-గాంధీదాం(22974) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిల్చార్(12513) ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు సెంట్రల్-సంత్రగచ్చి(22852)వివేక్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-కామాఖ్య (12551) ఏసీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్

27న రద్దయిన రైళ్లు

రామేశ్వరం-భువనేశ్వర్(20895) ఎక్స్‌ప్రెస్, వాస్కోడిగామా-షాలిమర్(18048)అమరావతి ఎక్స్‌ప్రెస్, గౌహతి-ఎస్ఎంవీటి బెంగళూరు(12510) ఎక్స్‌ప్రెస్

- 29న మాల్దా టౌన్-సికింద్రాబాద్(03430) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దయింది.

క్లుప్తంగా

29 నుంచి అన్నపూర్ణమ్మవారి నిజరూప దర్శనం

అనకాపల్లి: మండలంలో బట్టపూడి గ్రామంలో అంజనేయస్వామి గుడి వెనుక కొండపైన అన్నపూర్ణమ్మదేవి ఆశ్రమంలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ అన్నపూర్ణమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆశ్రమం నిర్వహకులు సోహం రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న అమ్మవారికి విశేష అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, 30న అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, 31న దీపావళి అమావాస్య సందర్భంగా ఉదయం 10 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి: అనకాపల్లి విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్ పరిధిలో ఈ నెల 25న మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ త్రినాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భీమునిగుమ్మం, మళ్ల వీధి, శేఖ వీధి, నాగవంశం వీధి, ఉడ్ పేట, నర్సింగరావు పేట, చవితి వీధి, కాశీవిశ్వేశ్వరస్వామి అలయం రహదారి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కొత్తూరులో.. మండలంలో కొత్తూరు గ్రామ పంచాయతీలోని 33/11 కేవీ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు నిమిత్తం ఈనెల 25 ఉదయం 9 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల అవుతుందని కశింకోట డివిజన్ ఏఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో కూంద్రం, కుంచంగి, రొంలివానిపాలెం, వేటజంగాలపాలెం, సంపతిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లం వర్తకుడు యల్లపు మృతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో వర్తకుడు యల్లపు రమణ (87) అనారోగ్య కారణంతో బుధవారం వారి స్వగృహం వద్ద మృతి చెందారు. వర్తక సంఘం సభ్యులు, పలు సంఘాల నాయకులు రమణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడుకి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, అందరికీ వివాహాలు జరిగాయి.

అయోడిన్ ఉప్పు వినియోగం తప్పనిసరి

మునగపాక: తీసుకునే ఆహారంలో అయోడిన్ లేని ఉప్పు వాడకం వల్ల ప్రమాదకరమైన రోగాల బారిన పడాల్సి వస్తుందని మునగపాక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ మళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. మునగపాకలోని ప్రణతి హైస్కూల్‌లో బుధవారం అయోడిన్ లోపం కారణంగా పిల్లలకు కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడకపోవడం వల్ల థైరాయిడ్, గొంతు వాపు వ్యాధి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకాంత,నాగేశ్వరరావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
వీక్షణం	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్- 3 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 325 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



వాన నీటిలో స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు



తాళ్లపాలెం హైస్కూల్



పై అంతస్తు పెచ్చులు రాలి శిథిలావస్థకు చేరిన శ్లాబ్ ముందు భాగం



తాళ్లపాలెం హైస్కూల్లో నిర్వహిస్తున్న తరగతులు

సరస్వతీ నిలయం.. సమస్యల తోరణం

మండలంలోని తాళ్లపాలెం హైస్కూలు వర్షం వస్తే వరద నీటిలో నానుతోంది. ఏ మాత్రం వర్షం వచ్చినా నిండిపోయి రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోయి స్కూలు ప్రాంగణం చెరువును తలపిస్తోంది. మోకాలి లోతు నీటిలో స్కూల్లోకి విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి రావడంతో నానా యాతన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వరద నీరు పోవడానికి సరైన మార్గం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం.

- ముంపు ముప్పులో తాళ్లపాలెం హైస్కూల్
- వర్షం వస్తే.. చెరువులా మారుతున్న పాఠశాల
- మోకాలి లోతు నిల్వ నీటిలోనే విద్యార్థుల రాకపోకలు

కశింకోట: తాళ్లపాలెం హైస్కూల్లో 3 నుంచి పదవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో 307 మంది విద్యార్థులు చదువుతున్నారు.15 మంది ఉపాధ్యాయులున్నారు. తాళ్లపాలెంతో పాటు చుట్టుపక్కల ఉన్న ఉగ్గినపాలెం, పరవాడపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. వీరిని గత కొంత కాలంగా వర్షపు నీటి ముప్పు వేధిస్తోంది. ఏ మాత్రం వర్షం వచ్చినా గ్రామం నుంచి పెద్ద ప్రవాహంలా నీరు వచ్చి పల్లంగా ఉన్న పాఠశాల ప్రాంగణం, ప్రవేశ ద్వారం, మైదాన ప్రాంతాల్లో నిల్వ ఉండిపోతోంది. వర్షం నీరు నిల్వ ఉండిపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది వాటి వల్ల జ్వరాలు, నిల్వ నీటిలో నడవడం వల్ల చర్మవ్యాధులు ప్రబలుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వర్షం వస్తే స్కూలు పక్కన జాతీయ రహదారి కింద ఉన్న మదుం ద్వారా నీరు వెళ్లిపోయేది. ఇప్పుడు ఆ మార్గం తుప్పలు, చెత్తతో పూడుకుపోవడం, ఆక్రమణకు గురవ్వడం వల్ల నీరు వెళ్లని పరిస్థితి. అలాగే పాఠశాల చుట్టూ ఎత్తు చేశారు. దీంతో పల్లంగా ఉన్న పాఠశాల ప్రాంగణంలోకి వర్షం నీరు వెల్లువలా వచ్చి నిల్వ ఉండిపోతోంది. దీన్ని తొలగించడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే పాఠశాల పై అంతస్తు శ్లాబ్ ముందు భాగం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. కొన్నిచోట్ల పెచ్చులు కూడా రాలిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ తరగతి గదులను ఖాళీ చేశారు. వరద నీటి సమస్య ఇబ్బందికరంగా మారిందని, దీన్ని పరిష్కరించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉండిపోయిన వర్షపు నీరు

నీటిలోనే రాకపోకలు



వర్షం వచ్చిందంటే పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో మోకాలి లోతు నీటిలో పాఠశాలలోకి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఆ నీరు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండిపోతుండటంతో ఆ నీటిలోనే తడిచి స్కూలుకు రావాల్సి వస్తోంది. నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.వీరేష్, విద్యార్థి, తాళ్లపాలెం హైస్కూలు

జ్వరాలు, చర్మవ్యాధులు వస్తున్నాయి



వర్షం నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండిపోతుండటం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరం, చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో భయంగా ఉంది. దీని దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే స్కూలు భవనం పై అంతస్తు శ్లాబ్ ముందు భాగం దెబ్బ తిని ప్రమాదకరంగా ఉంది. దానికి మరమ్మతులు చేపట్టాలి.

– యు.లిఖిల్, విద్యార్థి, తాళ్లపాలెం హైస్కూల్

అధికారులకు సమస్య నివేదించాం

హైస్కూలు ప్రాంగణంలో సరైన మార్గం లేకపోవడం, పల్లంగా ఉండటం వల్ల వర్షం పడితే నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతుండటంతో రాకపోకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని నివేదించి నివారణ చర్యలు తీసుకోవడం కోసం జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు దృష్టికి తీసుకెళ్లాం. అందుకు చర్యలు చేపడతామంటూ సానుకూలంగా స్పందించారు.

– వై. విజయలక్ష్మి సుమన్, హెచ్‌ఎం, తాళ్లపాలెం హైస్కూల్

తాళ్లపాలెం కూడలిలో మరమ్మతు పనులు



తాళ్లపాలెం కూడలిలో జరుగుతున్న పనులు



కాలువలో పూడిక తీసి శుభ్రం చేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఏ మాత్రం వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోయి తాళ్లపాలెం-నర్సీపట్నం మార్గంలో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కల వ్యాపారులు, స్థానికులు నీరు నిల్వ ఉండిపోవడంతో జనజీవనానికి, వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు వీలు కావడంలేదు. రోడ్డు గోతులు పడి నీటిలో కానరాక వాటిలో పడి గాయాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల వినతి మేరకు జాతీయ రహదారి అధికారులు స్పందించి కూడలిలో పాక్‌లెన్‌తో పూడుకుపోయిన కాలువ మార్గాల్లో మట్టి, మురుగు, చెత్తా చెదారం తొలగించి మార్గం సుగమం చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ పనిని తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన.. నీరు నిల్వ ఉండకుండా చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

గ్రామ సభకు 37 అర్జీలు

కశింకోట: మండలంలోని వెదురుపర్తిలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించి 37 అర్జీలు స్వీకరించారు. భూముల విస్తీర్ణం కొలతలు హెచ్చు తగ్గులు, లోపాలు సరి చేయాలని కోరుతూ అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, సర్వేయర్ రామారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో సభలు

మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పల్లపు సోమవరంలో, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎఎస్ పేట గ్రామంలో సభలు జరుగుతాయన్నారు. భూ సమస్యలను సభల్లో పరిష్కరిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తుమ్మపాల పంచాయతీలో రూ.38 లక్షలతో అభివృద్ధి పనులు

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధిలో రూ.38 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ డ్రైనేజీ, రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. గవరపేట వీధి నుంచి రామాలయం మీదుగా శివాలయం వరకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, గవరపేట వీధి నుంచి ప్రమీలానగర్ వరకు రూ.18 లక్షలతో ఎల్లయ్య కాలువ సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గవరపేట వీధిలోని మురుగు నీటి కాలువతో 30 ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారే స్వచ్ఛందంగా అభివృద్ధి చేయాలని ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పంచదారల కన్నారావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, కూటమి నేతలు పాల్గొన్నారు.



గవరపేట వీధిలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

స్క్రాప్ దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధి గుండా జంక్షన్ నుంచి యూనియన్ బ్యాంక్ వరకు సుమారు 8 ద్విచక్ర వాహనాల స్క్రాప్ దుకాణాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు అన్నారు. బుధవారం స్క్రాప్ దుకాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా నలుమూలల నుంచి తీసుకొచ్చిన పాత బైకుల కొనుగోలు, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా దుకాణ యజమానులు అమ్మకాలు, కొనుగోళ్లు సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. జనావాసాల మధ్య, రహదారికి ఇరువైపులా స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని హరనాథ్‌బాబు కోరారు.



గుండాల జంక్షన్ రహదారిపై స్క్రాప్ దుకాణాల వద్ద ద్విచక్ర వాహనాలు

షటిల్ కోర్టు ఏర్పాటుకు భూమిపూజ

కశింకోట: కశింకోటలోని బాలికల హైస్కూల్‌లో కొత్తగా షటిల్ కోర్టు ఏర్పాటు చేయడానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యా కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలోనే కోర్టు ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. వీటితోపాటు వాలీబాల్ తదితర ఆటలకు సంబంధించిన కోర్టులను కూడా ఒక్కొక్కటిగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పునరుద్ధరించాలని ఆందోళన

మునగపాక: తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని వెంకటాపురం, తోటాడ పాల కేంద్రాల ఎదుట రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సరికాదని సీఐటీయూ నేతలు గనిశెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు ఆరోపించారు. రైతులు చేస్తున్న ఆందోళనకు వారు మద్దతు తెలిపారు. రైతులకు న్యాయం చేయకుంటే 29న డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు బోనస్ కూడా చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఈ ఆందోళనలో రైతులు కాండ్రేగుల రామసూరప్పారావు, సిరి వరహాలరాజు, ఏదూరి రమణ, పండూరి తాతయ్య, చిన్ని రామారావు, సుందరపు అప్పారావు, పండూరి లక్ష్మి, నాగరాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదకు భద్రత ఏదీ?

తుపాను ప్రకటన వస్తే చాలు గంగపుత్రులకు బెంగ పట్టుకుంటుంది. కంటి మీద కునుకు ఉండదు. ఏ క్షణాన సముద్రం ఉగ్రరూపం దాల్చి తీరంపైకి దండెత్తుతుందో, ఇసుక తిన్నెలపై భద్రపరచుకున్న వలలు, ఇంజిన్లు, తెప్పలు ఎక్కడ కెరటాల ధాటికి కొట్టుకుపోతాయోనని ఆందోళన చెందుతుంటారు. ఒక పక్క ప్రాణాలు.. మరో పక్క జీవనాధారమైన వలలు, ఇంజిన్లు కాపాడుకోవడం కోసం మత్స్యకారులు పడే కష్టాలు వర్ణనాతీతం. స్టోర్ రూములు లేకపోవడంతో చాలా ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి.

- ఇసుక దిబ్బలపైనే ఎండు చేపలు
- పాకల్లోనే ఇంజిన్లు, వలలు
- స్టోర్ రూమ్‌లు లేక.. గంగపుత్రుల ఇబ్బందులు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో సుమారు 30 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. 17 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 25 వేల మందికి పైగా మత్స్యకారులు జీవిస్తున్నారు. ఈ గ్రామాల నుంచి సుమారు 6 వేల మంది తెప్పలు, మోటారు ఇంజిన్లతో వేట సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో వేటాడిన మత్స్య సంపదను ప్రతి శుక్రవారం నక్కపల్లిలో జరిగే వారపు సంత ద్వారా విశాఖ, హైదరాబాద్, కోల్‌కతా, తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. నెలకు ఈ ప్రాంతం నుంచి సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతి అవుతోంది. అయినా కనీస సౌకర్యాలు లేక గంగపుత్రులు సతమతమవుతున్నారు. తీర ప్రాంతాలను ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో కనీస సదుపాయాలు లేవు. వలలు, ఇంజిన్లు, తెప్పలు భద్రపరచుకునేందుకు షెడ్లు లేవు. వేటాడి తెచ్చిన మత్స్య సంపదను భద్రపరచుకోవడం, ఎండ బెట్టుకునేందుకు, మార్కెటింగ్ చేసుకునేందుకు ప్లాట్ ఫారాలు గానీ, స్టోర్ రూములు గానీ అందుబాటులో లేవు. సముద్రపు ఒడ్డున ఇసుక తిన్నెల్లోనే చేపలను ఎండబెట్టుకోవాల్సిన దుస్థితి ఉంది. ప్రస్తుతం ఇసుక దిబ్బలపై పందెళ్లు వేసి వలలు, ఇంజిన్లు, భద్రపరుస్తున్నారు. వేట పూర్తయిన తర్వాత, తుపాను హెచ్చరికల సమయంలో తెప్పలు, బోట్లకు కూడా రక్షణ ఉండడం లేదు. కెరటాల ఉధృతికి తెప్పలు, ఇంజిన్లు సముద్రంలోకి కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మరో వైపు ఇసుక తిన్నెలపై ఎండబెట్టిన చేపలకు సరైన గిట్టుబాటు ధర రాదని, సిమెంట్ ప్లాట్ ఫారాలపై ఎండబెడితే మంచి ధర వస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. పాడైన వలలు, మోటారు బోట్లు, తెప్పలకు ఇసుక దిబ్బలపైనే మరమ్మతులు చేపట్టాల్సి వస్తోంది. స్టోర్‌రూములు, షెడ్లు, ఫ్లాట్‌ఫారాలు ఉంటే అక్కడ ఎంచక్కా మరమ్మతులు చేసుకోవడానికి వీలుంటుందని వారు అంటున్నారు.



ఇసుక దిబ్బలపైనే చేపలు ఎండబెడుతున్న దృశ్యం

అందని మత్స్యకార భరోసా

వరుస వాయు గుండాలతో వేటకు దూరమై పస్తులుంటున్నామని, ప్రతి ఏటా ఇచ్చే మత్స్యకార భరోసా కూడా ఈ ఏడాది ఇంత వరకు అందలేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసింది. రూ.22 కోట్లు కేటాయించినప్పటికీ స్థల సమస్య వల్ల నిర్మాణానికి నోచుకోలేదు. ఈ నిధులతో జెట్టీ నిర్మిస్తే మత్స్యకారుల కోసం ప్లాట్ ఫారాలు, స్టోర్ రూములు ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మించాలని, తీర ప్రాంతాల్లో మత్స్యకారుల కోసం స్టోర్ రూములు, షెడ్లు నిర్మించాలని గంగపుత్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



చినదొడ్డిగల్లు పాఠశాలలో మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ



వమ్మవరం పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం రమేష్

నక్కపల్లి: చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంటకరమణ ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సొంత ఖర్చులతో ఈ మెటీరియల్‌ను అందజేసినట్లు రమణ తెలిపారు. స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉపకార వేతనాలు పొందాలని ఆకాంక్షించారు.

ఎస్.రాయవరం: వింగ్స్ ఫౌండేషన్ సమకూర్చిన ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను వమ్మవరం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ అందజేశారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణను ఆయా తరగతి ఉపాధ్యాయులు ఇవ్వాలని ఆయన సూచించారు.

కనుల పండువగా దుర్గాదేవి సారె ఊరేగింపు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో బుధవారం దుర్గాదేవి సారె ఊరేగింపు కనుల పండువగా సాగింది. మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల పిండి వంటలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మునగపాక: రాజుపేట గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కిలాడి దేముడు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7 లక్షల వ్యయంతో జెర్రిపోతుల కృష్ణ ఇంటి నుంచి కమ్యూనిటీ హాల్ వెనక వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఆయన బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపేటలో సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి అభివృద్ధి పనులు దశల వారీగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెర్రిపోతుల కనకమహాలక్ష్మి, వార్డు సభ్యురాలు పడాల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి పనులు

నక్కపల్లి : జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారంతా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంగిల్ క్లియరెన్స్, పంట కాలువల నిర్మాణం, ఉద్యానవన పంటలు తదితర పనులు చేపట్టాలన్నారు. వలసల నిరోధానికి ఉపాధి పనులు దోహదపడతాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మినీ గోకులాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీ సాధారణ నిధుల మ్యాచింగ్‌తో గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రారంభం



భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆలయ ప్రాంగణంలో ఉచిత భిక్ష సదుపాయం కల్పిస్తూ మాలలు ధరించిన భక్తులకు సేవలందించడం సంతోషకరమన్నారు. 40 రోజుల పాటు జరిగే భిక్ష సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వేగి లక్ష్మణరావు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి కన్నారావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.